క్లుప్తంగా

వాసవిక్లబ్స్ గవర్నర్‌గా తేజయశస్వి గుప్తా



ప్రమాణస్వీకారం చేస్తున్న మునగాల తేజ యశస్వి గుప్తా

పీలేరు : వాసవిక్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ211ఏ – 2025 గవర్నరుగా తిరుపతికి చెందిన మునగాల తేజ యశస్వి గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమిశెట్టి లీలాసురేష్ సంబరాలు డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు డాక్టర్ హెచ్.ఎస్. నాగభూషణ, అబ్జర్వర్ శ్రీనివాసులు, డిస్ట్రిక్ట్ వీ211ఏ – 2024 అధ్యక్షుడు సోమిశెట్టి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా



బీరంగి సచివాలయం ఎదుట సీపీఐ ధర్నా

బి.కొత్తకోట : పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ మండలంలోని బీరంగి గ్రామ సచివాలయం ఎదుట సీపీఐ కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలలో నివశిస్తున్న పేదలకు మూడు సెంట్ల స్థలంతో ఇళ్లు మంజూరు చేయాలని నినాదాలు చేశారు. నిర్మాణలకు స్టీలు, ఇసుక, ఇటుకలు ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, రఘునాథ్, అప్రపల్లీ, నారాయణ స్వామి, శంకరప్ప, గంగాదేవి, రమణ, లక్ష్మన్న, నరసింహులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న 108 సిబ్బంది

కేవీపల్లె : 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ క్రాంతికుమార్‌కు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 సిబ్బంది సమస్యలపై వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 25 నుంచి సమ్మెలో పాల్గొనను న్నట్లు తెలిపారు.

ఉచిత కంటి శస్త్రచికిత్సలు



కంటి ఆపరేషన్లకు హాజరైన వారితో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

మదనపల్లె సిటీ : స్థానిక లయన్స్ కంటి ఆస్పత్రిలో సోమవారం 28 మందికి ఉచితంగా క్యాటరాక్ట్ సర్జరీలు నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉచిత కంటి పరీక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ భాస్కరాచారి తెలిపారు. కంటి చికిత్సలు అర్హులైన వారికి ఉచితంగా ఆపరేషన్లు జరుపుతామన్నారు. ఇప్పటి వరకు మదనపల్లె పరిసర ప్రాంతాల్లో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పీఆర్‌ఓ గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు

తంబళ్లపల్లె : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు సోమవారం చిత్రలేఖన పోటీలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, టీచర్ వెంకట్‌కుమార్, గ్రంథాలయ అధికారి జిలానీబాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకుడు

కేవీపల్లె : అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని తిమ్మాపురం గ్రామ సచివాలయంలో సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలం, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలన్నారు.

అన్నదానం.. భగవత్ స్వరూపం

- మాలాధారణ భక్తులకు భిక్ష
- అయ్యప్పస్వామి ఆలయంలో పదేళ్లుగా సేవలు



భిక్ష చేస్తున్న అయ్యప్ప మాలాధారులు

మదనపల్లె సిటీ : కార్తిక మాసంలో భక్తులు అయ్యప్ప స్వామి మాలధారణ చేస్తారు. స్వాములకు నియమాల మేరకు అల్పాహారం, భిక్ష స్వీకరిస్తారు. ఇళ్లలో కొన్ని సమస్యల కారణంగా చాలా మంది భక్తులు ఇబ్బందులు పడుతుంటారు. ఇది గుర్తించిన కొందరు మాలధారణ సమయంలో నిత్యాన్నదానం చేయాలని భావించారు. అలా చిన్నగా మొదలైన కార్యక్రమం నేడు వందల మందికి భిక్ష అందిస్తున్నారు.

మదనపల్లె పట్టణం అయ్యప్పనగర్‌లో వెలసిన అయ్యప్పస్వామి ఆలయం నిత్యాన్నదాన కేంద్రంగా . పదేళ్ల కిందట ప్రారంభమైన అన్నదాన ప్రక్రియ కార్తిక మాసం నాటి నుంచి సంక్రాంతి వరకు కొనసాగుతూ వస్తోందని అయ్యప్పస్వామి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మొదట్లో దీక్షదారులు సంఖ్య తక్కువగా ఉన్నా క్రమంగా పెరుగుతూ వస్తోంది. దాతల సహకారంతో నిత్యాన్నదానం కార్యక్రమం కొనసాగిస్తున్నారు. ఇక్కడ ఉదయం, రాత్రి వేళల్లో భిక్ష మాలధారులకు అందిస్తున్నారు.

దాతలు ముందుకు రావాలి



పనుల్లో నిమగ్నమైన దీక్షాపరులు ఉదయం, రాత్రి వేళల్లో ఇళ్లకు వెళ్లి భిక్ష చేయాలంటే ఇబ్బందిగా ఉంటుంది. అయ్యప్ప సన్నిధానంలో భిక్ష చేస్తే మంచి జరుగుతుందనే అభిప్రాయంతో ఇక్కడే భిక్ష కొనసాగిస్తున్నాం. దాతలు ముందుకొచ్చి అన్నదాన కార్యక్రమానికి సహకరించాలి. మరింత మంది భక్తులకు అన్నదానం చేసేందుకు వీలవుతుంది.

– శివస్వామి, ఉత్సవ కమిటీ సభ్యులు

మూడు నెలల పాటు పూజలు



కార్తిక మాసం ప్రారంభమైన రెండు, మూడు రోజుల నుంచే అన్నదానం ప్రారంభించినా.. నవంబర్ 16వ తేదీ నుంచి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అధికారికరంగా భిక్ష ఏర్పాటు చేస్తున్నాం. ఆలయంలో మూడు నెలలపాటు పూజలు జరుగుతాయి. కొంత మంది 21 రోజులు, కొందరు 41 రోజులు, ఇంకొందరు జ్యోతి దర్శనం వరకు దీక్ష కొనసాగిస్తారు. అలాంటి వారికి రోజు రెండు పూటల భిక్ష అందిస్తున్నాం.

– మల్లేనాయక్, గురుస్వామి

ప్రజాసమస్యలు తక్షణమే పరిష్కరించాలి

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



అర్జీల స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించేందుకు కృషిచేయాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని పాన్నేటిపాళ్యం పంచాయతీ నక్కల దిన్నె తండాలో నివాసం ఉంటున్న చిన్నరామానాయక్, పెంచుపాడు గ్రామంలోని దాదినాయుని తండాలో తమ తాత నాగేనాయక్ నుంచి తమ ముగ్గురు అన్నదమ్ములకు సంక్రమించిన ఆస్తికి పాసుపుస్తకాలు మంజూరుచేయాల్సిందిగా వినతిచేశారు. కొన్నేళ్లుగా పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకొన్నప్పటికీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పుకొచ్చారు. సీటీఎం క్రాస్ రోడ్డులోని ఇందిరమ్మకాలనీలో మిట్టపల్లెకు చెందిన గోపి పాలెం వెంకటేశు, జి.రాజశేఖర్‌లు నకిలీ పట్టాలు సృష్టించుకుని, రోడ్డు కోసం వదలిన స్థలంలో ఇంటిని అక్రమంగా నిర్మించారని పఠాన్ ఖాదర్‌ఖాన్ ఫిర్యాదుచేశారు. ఇదేకాకుండా ఈ ఇంటికి 50 మీటర్ల దూరంలో ప్రభుత్వ స్థలంలో మరో ఇంటిని దౌర్జన్యంగా నిర్మిస్తున్నాడన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

మదనపల్లె మండల తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇళ్లు నిర్మించుకునేందుకు సహకరించాలని క్లీన్ ఫుడ్స్ కార్పొరేషన్ ఇండియా కార్మికులు, తహసీల్దార్ ఖాజాబీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలసపల్లె పంచాయతీ సర్వేనెం 496–1, 816/1లో క్లీన్ ఫుడ్స్ జ్యూస్ ఫ్యాక్టరీ కార్మికులకు 1995లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 285 మందికి ఇళ్ల కోసం స్థలం మంజూరు చేశారన్నారు. ఫ్యాక్టరీలో తక్కువ వేతనాలతో పనిచేస్తుండటం, ఆర్థిక స్థితిగతులు అంతంతమాత్రమే ఉండటంతో అప్పట్లో ఇళ్లు నిర్మించలేకపోయామన్నారు. కొన్నేళ్ల క్రితం అధికారులను తిరిగి వేడుకోగా, స్థలం చదును చేసుకోమంటే అందరూ కలిసి లక్షలు ఖర్చు చేసి క్లీన్ చేసుకున్నామన్నారు. సదరు స్థలాన్ని సర్వే చేసి, కార్మికులందరికీ ప్లాట్స్ రూపంలో కేటాయిస్తే, ఇళ్లు నిర్మించుకుంటామని వినతిపత్రం సమర్పించారు.

జేసీబీ డ్రైవర్లకు పోలీసుల నోటీసులు

మదనపల్లె : ప్రభుత్వ స్థలాల్లో చదును పనులు చేసినా, చెరువుల్లో తవ్వకాలు జరిపినా జేసీబీ డ్రైవర్లపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ అన్నారు. సోమవారం పట్టణంలోని జేసీబీ యజమానులు, డ్రైవర్లకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో ఉద్దేశపూర్వకంగా జేసీబీలు చదును పనులు చేస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటుగా డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మహా సభలను జయప్రదం చేయండి

పీలేరురూరల్ : విజయనగరంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే 49వ ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ నాగార్జునరెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్, నియోజకవర్గ కార్యదర్శి వినోద్, నాయకులు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు వేగవంతం చేయండి

గుర్రంకొండ : ఆధార్ కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని చెర్లోపల్లె గ్రామసచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్‌కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆధార్ కేంద్రానికి ప్రతిరోజు ఎంతమంది వస్తున్నారు, వారి వివరాలు రికార్డుల్లో నమోదు చేస్తున్నారో లేదో రిజిష్టర్లు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగు గ్రామ పంచాయతీల కలిపి ఇక్కడ ఆధార్‌కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆధార్ సేవలు వేగవంతం చేయాలన్నారు. విద్యార్థులకు జనన ధృవీకరణ పత్రాల మంజూరులో ఎటువంటి జాప్యం లేకుండా త్వరగా ఇవ్వాలన్నారు. వీటికి సంబంధించిన ఫైళ్లు తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఆధార్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజిత, వీఆర్‌ఓ సంజీవ, సిబ్బంది సాయిలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషిచేద్దాం

నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ తెలిపారు. సోమవారం మండలంలోని జగన్‌కాలనీలో నాయకులు రఫీ, చిప్పిలిలో మల్లికార్జునరెడ్డి ఇంట జరిగిన శుభకార్యక్రమాలకు హాజరైన ఆయన స్థానికంగా ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఐదు నెలల్లోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటోందన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించిన సూపర్‌సిక్స్ అమలులో చతికిలబడిందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఠంచనుగా సంక్షేమ పథకాలను అందుకున్న ప్రజలు.. టీడీపీ పాలనలో అవస్థలు పడుతున్నారన్నారు. తల్లికి వందనం, మహిళలకు ఫ్రీ బస్సు సదుపాయం, రైతులకు పెట్టుబడి సాయం తదితర అనేక పథకాల లబ్ధి ప్రజలకు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. గ్రామాల్లో ప్రజలు జగన్ పాలనలో ప్రతి నెలా తమకు అందిన సంక్షేమ లబ్ధిని గుర్తు చేసుకుంటూ, బాబు మాయమాటలకు మోసపోయి ఓటేసి గెలిపించినందుకు తగిన శాస్తి జరిగిందంటూ మాట్లాడుకుంటున్నారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇసుక దోపిడీ, బెల్ట్‌షాపుల నిర్వహణలో మునిగిపోయారని, ప్రజలను, వారి సంక్షేమాన్ని పట్టించుకునే నాయకుడే కరువయ్యాడన్నారు. నియోజకవర్గంలో ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు అండగా ఉంటామని, అధికార పార్టీ వైఫల్యాలను ఇంటింటికి తీసుకెళ్లి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ జేసీఎస్ కన్వీనర్ మునిశేఖర్, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, మహమ్మద్ యాసీన్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల అమలులో విఫలం

గుర్రంకొండ : సూపర్ సిక్స్ పథకాల అమలుచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ అన్నారు. సోమవారం గుర్రంకొండలో డిసెంబర్ 4 తేదీన విజయవాడలో నిర్వహిస్తున్న ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయనే నమ్మకంతో ప్రజలు ఓట్లువేసి కూటమి పార్టీలకు అధికారం కట్టబెట్టారన్నారు. అయితే ప్రభుత్వం కార్పొరేట్లకు నమ్మినబంటుగా తయారైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ మండల కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు హరి, మాణిక్యం, రమణ, నరసింహులు పాల్గొన్నారు.

సీఐగా బాధ్యతల స్వీకరణ



లక్ష్మన్న

ములకలచెరువు : ములకలచెరువు సీఐ గా బి. లక్ష్మన్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిత్తూరు మహిళా స్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రాజారమేష్ రాయచోటి ఎస్‌బీకి బదిలీ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని సీఐ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

శివాలయాల్లో కార్తిక సందడి



మదనపల్లె సిటీ: లలితా త్రిపురసుందరిదేవికి పూజలు చేస్తున్న అర్చకులు ఫణికుమార్‌శర్మ



మదనపల్లె సిటీ: యోగభోగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

మదనపల్లె సిటీ : కార్తిక మూడవ సోమవారం పురస్కరించుకుని మదనపల్లె పట్టణంలోని శివాలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు స్వామిని దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక దేవళం వీధిలోని శ్రీ సోమేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయంలో కేదారేశ్వర వ్రతం నిర్వహించారు. అర్చకులు ఆలూరి ఫణికుమార్‌శర్మ భక్తులకు కేదారేశ్వర వ్రతం విష్టతను చదివి వినిపించారు. భక్తులు అత్తిరాసలు, పండ్లు స్వామికి సమర్పించారు. స్థానిక బెంగుళూరు రోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలయం ప్రాగణంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి కేదార గౌరివ్రతం జరిపారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని నీలకంఠేశ్వరస్వామి, స్థానిక సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి, రూరల్ మండలం సీటీఎంలోని గంగాధరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

శివ, పార్వతుల కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం : కార్తిక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో శివ, పార్వతుల కళ్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయం నుంచి వేద పండితులు మహన్యాసపూర్వక ఏకదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, కార్తిక దీపోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలందుకున్నారు. అనంతరం వైఎస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారి మఠం వారిచే శ్రీ విరజానంద బృందం వారు చేసిన కోలాట దృశ్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



శివ, పార్వతులకు కల్యాణం జరుపుతున్న పండితులు

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మదనపల్లె నియోజకవర్గంలో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేసి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంలో భాగంగా రోడ్ల విస్తరణ చేసేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సీటీఎం రోడ్డులోని చింతచెట్లను తొలగించామన్నారు. సీటీఎం రోడ్డులోని శివాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రూ.12 కోట్లతో ఫ్లై ఓవర్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సీఎం ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ శాఖ పరిశీలనలో ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో రూ.10కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు నిర్మాణం శరవేగంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాదెండ్ల విద్యాసాగర్, నాగూర్‌వలీ, షంషేర్, ఎస్.ఏ.మస్తాన్, ఎస్.ఎం.రఫీ, రాటకొండ గుర్రప్పనాయుడు, రామిశెట్టి నీలకంఠ, గంగారపు నవీన్‌చౌదరి, ఫణికర్‌రెడ్డి, పులిమహాలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

సచివాలయం ఉన్నట్టా.. లేనట్టా?



పట్టెంవాండ్లపల్లి గ్రామ సచివాలయం

పెద్దతిప్పసముద్రం : ఉద్యోగులు అందుబాటులో లేక సచివాలయ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఇటీవల చేపట్టిన అధికారుల బదిలీల్లో గందరగోళం నెలకొని కీలకమైన అధికారులు లేకుండాపోయారు. దీంతో ఇన్‌ఛార్జులే విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని పట్టెంవాండ్లపల్లి సచివాలయంలో కీలకంగా ఉండాల్సిన డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామ పంచాయతి కార్యదర్శి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వన్‌బీ, అడంగల్, కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువపత్రం కావాలన్నా పక్కనున్న కమ్మచెరువు సచివాలయానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జనన ధ్రువీకరణ పత్రం కోసం అక్కడికి వెళ్తే ఇన్‌చార్జి కార్యదర్శిగా ఉన్న వ్యక్తి కోసం కమ్మచెరువుకు వెళ్లాలని చెబుతున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలో ఏడాది కాలంగా ప్రింటర్ పనిచేయకున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు స్వగ్రామంలోనే సేవలదించేందుకు సచివాలయాలు ఏర్పాటుచేసి సరిపడా సిబ్బందిని నియమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లా అధికారులు కీలక పోస్టులను భర్తీ చేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



కలకడ: ఉన్నతపాఠశాలలో వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు



పీలేరు : సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం ఆర్. సురేంద్రరెడ్డి

పీలేరు : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జెడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్. సురేంద్రరెడ్డి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో చరిత్ర పుస్తకాలు, పురాణాలు, ఇతిహాసాలు, కథల పుస్తకాలు, పోటీపరీక్షలకు ఉపయోపడే పుస్తకాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అమరనాథ్, కవులు మురళీధర్‌రాజు, శ్రీరాములురాజు, భాస్కర్, నరసింహులు, షేక్ షాహిద్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో విద్యాప్రమాణాలు మెరుగు

కలకడ : పోటీ పరీక్షల్లో పాల్గొనడం వలన విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు మెరుగుపడతాయని కలకడ క్లష్టర్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతిరెడ్డి అన్నారు. సోమవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కలకడ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయాధికారి అమరనాథ, విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పర్యవేక్షలుగా ఆపాఠశాల ఉపాధ్యాయులు వైవిరమణ, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవరచుకోవాలి

కలికిరి: విద్యార్థులు పుస్తక పఠనం అలవచురుకోవాలని ప్రముఖ కవి, ఎస్వీయూ మాజీ పాలకమండలి సభ్యుడు వేంపల్లి అబ్దుల్ ఖాదర్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన పుస్తక పఠనం అలవాటుతో కలిగే ఉపయోగాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి విజయ్ కుమార్, సీకాం కళాశాల, ఇందిరమ్మ కాలనీ జెడ్పీ హైస్కూల్, ఎంపీపీ మెయిన్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతం



మంజునాథస్వామి ఆలయంలో కేదారేశ్వర వ్రతాన్ని ఆచరిస్తున్న అర్చకులు, మహిళలు

గుర్రంకొండ : మండలలోని పలు గ్రామాల్లో కేదారేశ్వరీ నోముల పండుగను వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసంలో ప్రతి సోమవారం ఈ పండుగను నిర్వహించారు. ఇందులో భాగంగా ఈరోజు మూడవ సోమవారం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గుర్రంకొండలోని శ్రీమంజునాథస్వామి ఆలయం, తరిగొండలో శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, ఎగువబురుజుపల్లె లోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయం, ప్యారంపల్లెలో శ్రీ శివాలయంలలో మహిళలు భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతాన్ని ఆచరించారు. అమ్మవారికి అత్తిరసాలను నైవేద్యంగా సమర్పించి నోము దారాలు, బంగారు నోములతో పండుగ నిర్వహించారు. ఆలయాల్లో అర్చకులు కేదారేశ్వరవ్రత కథను చదివి వినిపించి వ్రత మహత్యాన్ని అందరికి తెలియజేశారు.

కలకడ : భక్తి శ్రద్ధలతో కేదారేశ్వర వ్రతాన్ని భక్తులు నిర్వహించారు. సోమవారం మండలంలోని కలకడ, కోన, నడిమిచెర్ల, ఎర్రకోటపల్లె శివాలయాల్లో ఉపవాసదీక్షతో భక్తులు నోములు నోచుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలకు హాజరైన భక్తులకు ఆలయకమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

తంబళ్లపల్లె : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది సమష్టిగా పని చేయాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని కన్నెమడుగు, తంబళ్లపల్లె సబ్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన 5 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడ లో వోల్టేజీ సమస్య ఉన్నా వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ట్రాన్స్‌కో డీఈ గంగాధర్, ఏడీఈ గోవిందరెడ్డి, ఎఈ శేషు, సిబ్బంది ఉన్నారు.

భక్తులతో మల్లయ్యకొండ కిటకిట



తంబళ్లపల్లె: నోముల వ్రతంలో మహిళలు



కురబలకోట: అంగళ్లు మల్లయ్యకొండపై భక్తులు

తంబళ్లపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. కార్తికమాసం మూడో సోమవారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాది భక్తులు మల్లయ్య దర్శనానికి తరలివచ్చారు. మహాశివరాత్రిని తలపించేలా భక్తుల శివనామస్మరణతో మల్లయ్యకొండ మార్మోగింది. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామిని అలంకరించి పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు కేదారేశ్వరగౌరీ వత్రం నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ముగింట ధ్వజస్తంభం ఎదుట కార్తిక దీపాలు వెలిగించారు. మల్లయ్యకొండ మాజీ చైర్మన్, పారిశ్రామికవేత్త కనుగొండ మద్దిరెడ్డి భక్తులకు అన్నదానం చేశారు.

మల్లయ్య కొండపై కార్తిక శోభ

కురబలకోట : కార్తిక మాసం సందర్భంగా అంగళ్లు మల్లయ్య కొండపై ఆధ్యాత్మిక శోభ వెల్లివెరిసింది. వివిధ ప్రాంతాల నుండి భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున విచ్చేయడంతో ఆలయం కిటకిటలాడింది. వేకువ జామునుండే దర్శనానికి బారులు తీరిన భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమేశ్వరుడి నామస్మరణతో కొండంతా మార్మోగింది. దూప దీపాలతో నైవేద్యం సమర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఎల్‌ఐసీ మద్దిరెడ్డి దంపతులు, ప్రతిభ, మారుతీ ప్రసాద్, తుపాకుల వెంకట్రమణ, ఉమాదేవి, ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.